సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం, 12, ఫిబ్రవరి, 2024




ఆదివాసీ సంప్రదాయం అందరికీ ఆదర్శం 8లో

ఆదివాసీ, సంప్రదాయాలు ఆదర్శమని చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా అన్నారు.



ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

విశాఖ సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు.



నేత్రపర్వం నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి నిత్యకల్యాణం ఆదివారం నేత్రపర్వంగా నిర్వహించారు.

ఆడుదాం ఆంధ్ర ఫైనల్స్‌కు సీఎం జగన్

రేపు విశాఖలో క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించనున్న ముఖ్యమంత్రి



సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విశాఖ రానున్నారు. ఆడుదాం ఆంధ్రా రాష్ట్ర స్థాయి ముగింపు వేడుకల్లో పాల్గొని విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. ఈ మేరకు ఆదివారం పర్యటన షెడ్యూల్ ఖరారు చేశారు. మంగళవారం సాయంత్రం 5.20 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధురవాడ ఐటీ హిల్స్–3 వద్ద గల హెలీప్యాడ్ వద్దకు 5.30 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన 6 గంటలకు పీఎం పాలెం వైఎస్సార్ క్రికెట్ స్టేడియంకు చేరుకుంటారు. సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకూ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ (చివరి ఐదు ఓవర్లు) సీఎం వీక్షిస్తారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రసంగిస్తారు. అనంతరం విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తారు. రాత్రి 8.05 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 8.30 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 8.35 గంటలకు విమానంలో గన్నవరంకు బయలుదేరుతారు.

సీటు కోసం సిగపట్లు

- రంపచోడవరం టీడీపీలో తలోదారి
- పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం
- ఆదినుంచి వైఎస్సార్‌సీపీకి కంచుకోట
- విజయమే లక్ష్యంగా ఉత్సాహంగా పార్టీ శ్రేణులు

రంపచోడవరం : నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి తలోదారి అన్నట్టుగా ఉంది. గ్రూపు రాజకీయాల కారణంగా ఆ పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం నెలకొంది. ఈ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీకి కంచుకోట. ఇక్కడ గత రెండు దఫాలుగా ఆ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. 2014లో వైఎస్సార్‌సీపీ తరపున విజయం సాధించిన వంతల రాజేశ్వరి పార్టీ ఫిరాయించి టీడీపీలో చేరారు. 2019 ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీచేసిన ఆమె ఘోర పరాజయం పాలయ్యారు. ఆమెపై వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి 39 వేల భారీ మెజారిటీ విజయం సాధించారు.

ఎవరికివారే అన్నచందంగా..

వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి ఈ నియోజకవర్గ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులకు ప్రజలు పట్టం కడుతున్నారు. దీంతో సహజంగానే టీడీపీ శ్రేణుల్లో నిర్లిప్తత నెలకొంది. ఎవరికి వారే యమునాతీరే అన్న చందంగా ఆ పార్టీ నేతల పరిస్థితి ఉంది. అసెంబ్లీ సీటు కోసం పోటీపడుతున్న నాయకుల్లో ఎవరికి టికెట్ దక్కినా మిగతా వారు సహకరించే పరిస్థితి లేదని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.



అసెంబ్లీ టికెట్‌ను ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబురమేష్, వంతల రాజేశ్వరితోపాటు గొర్లె సునీత, మిరియాల శిరీష, సున్నం వెంకటరమణ, గొర్లె శ్రీకాంత్ గ్రూపులుగా విడిపోవడంతో టీడీపీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది. మరోపక్క పొత్తులో భాగంగా ఈ సీటును తమకు కేటాయించాలని జనసేన నాయకులు కోరుతున్నారు. ఇందులో భాగంగానే ఆ పార్టీకి చెందిన కుర్ల రాజశేఖరరెడ్డి, కాకి స్వామి, చారపు రాయుడు ముఖ్య నాయకులను కలిసి తమ ప్రయత్నాలు ప్రారంభించారు. గ్రూపు రాజకీయాలతో విసిగిపోయిన టీడీపీ శ్రేణులు జనసేనకు ఎమ్మెల్యే టికెట్ కేటాయిస్తే తమకు ఎటువంటి అభ్యంతరం లేదని బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. మరోపక్క, ఓ మాజీ ఎంపీ కూడా టీడీపీలో చక్రం తిప్పుతున్నారు. అసంతృప్తి వాదులందరినీ ఆమె కూడగట్టడంతో పార్టీ శ్రేణుల పరిస్థితి తలోదారి అన్నట్టుగా ఉంది. ఇక వైఎస్సార్‌సీపీ విషయానికి వస్తే గ్రామస్థాయిలో పటిష్టంగా ఉంది. ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ ఉత్సాహంగా పనిచేస్తున్నారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం

ఎమ్మెల్సీ కుంభా రవిబాబు



గుమ్మకోట గ్రామ సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ కుంభా రవిబాబు

అనంతగిరి: సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్య పాలనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారని ఎమ్మెల్సీ కుంభా రవిబాబు అన్నారు. మండలంలోని గుమ్మకోట పంచాయతీలోని సుమారు రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ. 20 లక్షలతో చేపట్టిన రైతు భరోసా కేంద్ర భవనాన్ని మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతితో ఆయన ప్రారంభించారు. సర్పంచ్ అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రవిబాబు మాట్లాడారు. ఓ వైపు సంక్షేమం..మరో వైపు అభివృద్ధితో గిరిజన ప్రాంతాలు ప్రగతి దిశగా పరుగులు పెడుతున్నాయన్నారు. గత ప్రభుత్వాల్లో కనీసం పంచాయతీ భవనాలు అధ్వానంగా ఉన్నందున సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. గతంలోని ఏ పని కావాలన్నా అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. సచివాలయ వ్యవస్థతో పాలనను గ్రామస్థాయిలోకి అందుబాటులోకి సీఎం తెచ్చారన్నారు. ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి, ఎంపీపీ శెట్టి నీలవేణి, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు స్వామి, జెడ్పీటీసీ గంగరాజు, ఎంపీటీసీలు తొటినాయుడు, అశోక్, మితుల, కో ఆప్షన్ సభ్యుడు మదీనా, సర్పంచులు సన్యాసిరావు, చిరంజీవి, ఉపాధ్యక్షులు కొర్రా సూర్యానారయణ, జేఏసీ జిల్లా కోఆర్డినేటర్ గంగులు, ఎంపీడీవో శ్రీహర్షిత్, ఎస్ఐ రాము, ఎంఎల్‌వో సతీష్, పాల్గొన్నారు.

వంజంగి హిల్స్‌పై సండే సందడి



సాక్షి,పాడేరు: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన వంజంగి హిల్స్‌కు ఆదివారం పర్యాటకులు భారీగా తరలి వచ్చారు. పొగమంచు,సూర్యోదయం అందాలను వీక్షించారు.ఉదయం 11గంటల వరకు సందడి చేశారు.

ఆనందం..అంతలోనే విషాదం

- సీతపల్లి వాగులో మునిగి ముగ్గురు విద్యార్థుల మృతి
- స్నేహితుడి పుట్టినరోజు వేడుకల్లో భాగంగా విహారం
- ఈతకు దిగడంతో ప్రమాదం
- ఊబి రూపంలో కబళించిన మృత్యువు
- పోస్టుమార్టానికి మృతదేహాల తరలింపు
- రంప యర్రంపాలెంలో విషాదం

ఆ ఐదుగురూ చిన్ననాటి స్నేహితులు. ఒకే పాఠశాలలో చదువుతున్నారు. వీరిలో ఒకరి పుట్టినరోజు సందర్భంగా ఎంతో ఉత్సాహంగా గడిపారు. కాసేపు తరువాత విహారానికి సీతపల్లి వాగు వద్దకు వెళ్లారు. సరదాగా స్నానం చేసేందుకు అందులో దిగిన ముగ్గురు ఊబిలో కూరుకుపోయి మృతి చెందారు. తాళాల కోసం బైక్‌ల వద్దకు వెళ్లిన ఇద్దరు అదృష్టవశాత్తూ ఆపద నుంచి బయటపడ్డారు.



రంపచోడవరం ఏరియా ఆస్పత్రి వద్ద విలపిస్తున్న మృతుని తండ్రి

రంపచోడవరం: స్నేహితుడి పుట్టినరోజు సందర్భంగా సరదాగా గడిపేందుకు వచ్చిన ముగ్గురు విద్యార్థులను వాగు రూపంలో మృత్యువు కబళించింది. ఇక్కడికి సమీపంలోని ఐ.పోలవరం జంక్షన్‌కు సమీపంలో సీతపల్లి వాగు వద్ద ఆదివారం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది.

ఇద్దరిని కాపాడిన బైక్ తాళాలు

తూర్పుగోదావరి జిల్లా రంప ఎర్రంపాలెం గ్రామానికి చెందిన కాకర వీరవెంకట అర్జున్(16), అండిబోయిన దేవీచరణ్ (16), లావేటి రామాంజీ (16) రంప ఎర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. వీరు అండిబోయిన మోహన్, కుంచే వికాస్‌తో కలిసి రెండు బైక్‌లపై బయలుదేరారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో సీతపల్లి వాగు వద్దకు చేరుకున్నారు. ఐదుగురు విద్యార్థులు స్నానానికి దిగారు. ఇంతలో బైక్ తాళాలు తీసుకురావడం మరచిపోయిన విషయం గుర్తుకు రావడంతో వారిలో ఇద్దరు ఒడ్డుకు వచ్చారు. వాహనాల వద్దకు వెళ్లి తాళాలు తీసుకుని మళ్లీ వాగు వద్దకు వచ్చి చూసేసరికి స్నేహితులు ముగ్గురు కనిపించలేదు. దీంతో ఒడ్డుపైకి వచ్చి ఎక్కడైనా దాక్కున్నారన్న అనుమానంతో వెతికారు. ఎక్కడా కనిపించకపోవడంతో రోడ్డుపైకి వచ్చి స్థానికులకు జరిగిన విషయం చెప్పారు.



వీరవెంకటఅర్జున్, దేవీచరణ్, రామాంజీ (ఫైల్)

పోలీసులు, ఫైర్ సిబ్బంది గాలింపు

ప్రమాద సమాచారం తెలుసుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది వెంటనే వాగులో గాలింపు చేపట్టారు. ముగ్గురి మృతదేహాలను బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆడుకోవడానికి వెళ్లిన తమ బిడ్డలు విగత జీవులుగా మారడాన్ని చూసి తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాలను స్థానిక ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తీసుకువచ్చారు. దీంతో ఆస్పత్రి పరిసరాలు విషాదఛాయలతో నిండిపోయింది. మృత్యువు వాగు రూపంలో ముగ్గురిని కబళించిదని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులకు కడుపుకోత

గోకవరం (తూర్పుగోదావరి జిల్లా): ఈత సరదా ముగ్గురు విద్యార్థుల ప్రాణాలను మృత్యువు కబళించడానికి కారణమైంది.స్నేహితుడి పుట్టిన రోజు సందర్భంగా సీతపల్లి వాగు వద్దకు వెళ్లిన మండలంలోని రంప ఎర్రంపాలెం గ్రామానికి చెందిన ఐదుగురు విద్యార్థుల్లో ముగ్గురు విద్యార్థులు ఈతకు దిగి ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయారు.

ఉదయం 11 గంటల వరకు పాఠశాలలో..

స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న వీరిలో రామాంజీ, మోహన్, వికాస్‌లు ఉదయం 11 గంటల వరకు పాఠశాలలో ఉన్నారు. అదనపు తరగతుల్లో భాగంగా ఎస్ఏ పరీక్ష రాశారు.



సీతపల్లి వాగు వద్ద గాలింపు చర్యలు చేపడుతున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది, చేరుకున్న స్థానికులు

స్నేహితుని జన్మదినం కావడంతో ఇంటి వద్ద భోజనం

వీరిలో అండిబోయిన మోహన్ జన్మదినం కావడంతో మిత్రులంతా అతని ఇంట్లో భోజనం చేసి మధ్యాహ్నం 1 గంట వరకు సరదాగా ఆడిపాడారు. అనంతరం కేక్ తీసుకువస్తామని ఇంట్లో చెప్పి రెండు బైక్‌లపై బయలుదేరి వెళ్లిన వీరు వాగులో ఈతకు దిగి ప్రమాదానికి గురయ్యారు. కుటుంబ సభ్యులకు గర్భశోకం మిగిల్చారు.

చదువు, క్రీడల్లో మేటి!

మృతులు ముగ్గురు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్నారు. మృతుల్లో కాకర వీరవెంకటఅర్జున్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు. అతని తండ్రి విష్ణు స్థానికంగా రేషన్ డీలర్‌గా పని చేస్తుండగా తల్లి గృహిణి, సోదరుడు ప్రదీప్ కాతేరులోని ఓ ప్రైవేటు స్కూల్‌లో ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. అండిబోయిన దేవీచరణ్ సైతం చదువుతో పాటు బ్యాడ్మింటన్ ఆటలో రాణిస్తున్నాడు. అతని తండ్రి అప్పారావు కూలీ పని చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు.



వాగులో నుంచి బయటకు తీసిన మృతదేహాలు

కూలి పని చేసుకుని..

లావేటి రామాంజీ (అంజి) తండ్రి సత్తిబాబు సైతం కూలి చేసుకుని కుమారుడిని చదివిస్తున్నాడు. రామాంజీ చెల్లి తులసి అదే పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతోంది. చదువులో బాగా రాణిస్తున్న వీరిని ఉన్నత చదువులు చదివించాలని కలలుకంటున్న వారి తల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చారు.

శోకసంద్రంలో గ్రామస్తులు

ముగ్గురు విద్యార్థులు మృతి చెందారన్న విషయం తెలుసుకున్న రంపయర్రంపాలెం గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు సైతం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఇంటర్ ప్రయోగ పరీక్షలు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ప్రయోగ పరీక్షలు తొలిరోజు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి.జిల్లాలోని 33 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లో ఇంటర్ బోర్డు జిల్లా ప్రత్యేకాధికారి ఎం.వినోద్‌బాబు తనిఖీలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఉదయం సెక్షన్‌లో1619 మంది, మధ్యాహ్నం సెక్షన్‌లో 1294 మంది విద్యార్థులు హాజరయ్యారు. రెండు సెక్షన్లలో 124 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

మారుమూల ప్రాంతాలకు విద్యుత్ సౌకర్యం

చింతపల్లి రూరల్: మారుమూల గిరిజన గ్రామాలన్నింటికి ఉచితంగా విద్యుత్ మీటర్ల ఏర్పాటు చేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ఎల్.మహేంద్రనాథ్ తెలిపారు. మండలంలో మూలగరువు గామాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పీవీటీజీలకు ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన పథకంలో భాగంగా పీవీటీజీల ఇళ్ల అన్నింటికి విద్యుత్ మీటర్లు అమరుస్తున్నామన్నారు. ఇందుకుగాను లబ్ధిదారులు ఎటువంటి రుసుము ప్రభుత్వానికి చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. అర్హులందరికీ ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. చింతపల్లి మండలంలో 1415 ఇళ్లకుగాను 900 చోట్ల మీటర్లు ఏర్పాటుచేశామన్నారు. గూడెం కొత్తవీధిలో 400కు పైగా మీటర్లు అమర్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ వనుము ప్రభాకర రావు, లైన్ ఇన్‌స్పెక్టర్ గంగరాజు పాల్గొన్నారు.

పర్యాటకుల తాకిడి



భారీగా తరలివచ్చిన పర్యాటకులు

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతం వద్ద సందడి నెలకొంది. ఆదివారం సెలవు కావడంతో మైదాన ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చారు. స్నానాలు చేస్తూ సందడి చేశారు. చిరు వ్యాపారాలు భారీగా జరిగాయి.

కూర పనసకు భలే డిమాండ్

- మన్యం నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి
- విరగ్గాయడంతో గిరి రైతుల్లో ఆనందం
- ఆశాజనకంగా ధరలు

సాక్షి, పాడేరు: ఏజెన్సీలోని గిరిజనులకు ఆదాయ వనరుల్లో ఒకటైన పనస ఈ ఏడాది విరగ్గాసింది. ఈ ప్రాంత గిరిజనులు ఏడాదిలో రెండు విధాలుగా ఆదాయం పొందుతుంటారు. లేత పనస కాయలకు ఇతర రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. మన్యంలో ఫిబ్రవరి నుంచి సీజన్ ప్రారంభం అవుతుంది. వివాహాది శుభకార్యాల్లో వీటిని వంటకాల తయారీకి వినియోగిస్తుంటారు. మే నెల వరకు ముహూర్తాలు ఉన్నందున మార్కెట్లో వీటిని పోటీపడి కొనుగోలు చేస్తుంటారు. ఏజెన్సీలో పనస ఏడాదిలో రెండు సార్లు కాపు ఉంటుంది.

విక్రయాలు ప్రారంభం

ఫిబ్రవరి, మార్చి నెలల్లో పిందె దశలోనే గిరిజనులు అమ్మకాలు జరుపుతారు. వర్షాలు కురిసిన తరువాత జూన్ నుంచి మరో కాపు వస్తుంది. వీటిని పండ్ల రూపంలో విక్రయిస్తారు. ఇలా ఏడాదిలో రెండు సార్లు ఆదాయం పొందుతారు. ఒడిశా, పశ్చిమబెంగాల్, బీహార్ రాష్ట్రాల్లో లేత (కూర) పనసకాయలకు మంచి డిమాండ్ ఉంది. ఆయా రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు గిరిజన రైతుల నుంచి వ్యాపారులు లేత పనస కాయలను కొనుగోలు చేస్తున్నారు. పాడేరు, హుకుంపేట, డుంబ్రిగుడ, అరకులోయ, అనంతగిరి, పెదబయలు మండలాల్లో పనసచెట్లు విరివిగా ఉన్నందున ఆయా ప్రాంతాల రైతులు మంచి ఆదాయం పొందుతున్నారు.



ఎగుమతి చేసేందుకు సిద్ధం చేస్తున్న కూర పనస

పోటీపడి కొనుగోళ్లు..

ఈఏడాది విరగ్గాయడంతో వారిలో లాభాల ఆశలు చిగురిస్తున్నాయి. సుమారు 40కిలోల బరువు గల లేత పనసకాయల బస్తా రూ.700 నుంచి రూ.800 ధరకు వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. సరాసరిన కాయ రూ.10 ధర పలుకుతోంది.అరకు, సుంకరమెట్ట, హుకుంపేట వారపుసంతల్లో కూడా లేత పనస అమ్మకాలు ఊపందుకున్నాయి. కొనుగోలు చేసి పనస కాయలకు పేపరు ప్యాకింగ్ చేసి బస్తాల రూపంలో ఎగుమతి చేస్తున్నారు.


మార్చి 18 నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

అడ్డతీగల: వచ్చే నెల 18 నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం నుంచి షెడ్యూల్ విడుదల అయిందని ఎల్లవరం ఎ–1 సెంటర్ కోఆర్డినేటర్ సీహెచ్.చిన్నిబాబుదొర తెలిపారు. టెన్త్‌కు సంబంధించి మార్చి18న తెలుగు, ఉర్దూ, కన్నడ, ఒరియా, తమిళం, ఇంటర్‌కు సంబంధించి హిందీ, తెలుగు,ఉర్దూ సబ్జెక్టులక పరీక్షలు నిర్వహిస్తారన్నారు. రెండవ రోజు 19న టెన్త్ విద్యార్థులకు హిందీ, ఇంటర్ జీవ శాస్త్రం, వాణిజ్య శాస్త్రం,వ్యాపార శాస్త్రం, గృహ విజ్ఞాన శాస్త్రం, 20న టెన్త్, ఇంటర్ విద్యార్థులకు ఇంగ్లీషు పరీక్ష ఉంటుందన్నారు. 22న టెన్త్ గణితం,భారతీయ సంస్కృతి వారసత్వం, ఇంటర్‌కు సంబంధించి గణితం, చరిత్ర, వ్యాపార గణాంక శాస్త్రం పరీక్షలు ఉంటాయన్నారు. 23న టెన్త్ విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక విజ్ఞానం,గృహ విజ్ఞాన శాస్త్రం , ఇంటర్ విద్యార్థులకు భౌతిక శాస్త్రం, రాజనీతి శాస్త్రం, పౌర శాస్త్రం, మనో విజ్ఞాన శాస్త్రం జరుగుతుందన్నారు. 26న టెన్త్‌కు సాంఘిక శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, ఇంటర్‌కు రసాయన శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, సామాజిక శాస్త్రం,27 న టెన్త్ విద్యార్థులకు బిజినెస్ స్టడీస్, మనో విజ్ఞాన శాస్త్రం సబ్జెక్ట్‌లకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు.ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు మార్చి 30 నుంచి ఏప్రిల్ 3 వరకూ జరుగుతాయన్నారు.ప్రతి రోజు పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకూ ఉంటాయన్నారు. పరీక్షల తేదీకి 10 రోజులముందు హాల్ టికెట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు.

గుట్టపై పోలింగ్ కేంద్రం

బోటుపై వెళ్లి సందర్శించిన సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

వీఆర్‌పురం : మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతంలో రహదారి మార్గం లేని తుమ్మిలేరు గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. తొలిత ఆయన రంపచోడవరం నుంచి నేరుగా మండలంలోని పోచవరం బోట్ పాయింట్‌కు చేరుకున్నారు.అక్కడి నుంచి భద్రాద్రి బోట్‌లో గోదావరి నదిపై తుమ్మిలేరు గ్రామం చేరుకున్నారు. అక్కడ కొండమీద ఉన్న 399 నంబరు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్నికల సమయంలో పోలింగ్ సిబ్బందికి అక్కడికి ఎలా చేరుకుంటారు? పరిసర గ్రామాల ఓటర్లను అక్కడి పోలింగ్ కేంద్రానికి ఎలా తరలిస్తారు..? తదితర అంశాలను రెవెన్యూ సిబ్బంది నుంచి తెలుసుకున్నారు. బోట్ల ద్వారా అక్కడికి తరలిస్తామని సిబ్బంది తెలిపారు. గ్రామస్తులతో మాట్లాడిన అనంతరం తిరిగి అదే బోటులో దేవీపట్నం వెళ్లారు. ఆయన వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, వీఆర్వో రామిరెడ్డి , రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



తుమ్మిలేరులో గుట్టపై ఉన్న పోలింగ్ కేంద్ర భవనం

క్లుప్తంగా

పూరిల్లు దగ్ధం



అప్పలరాజుపేటలో అగ్నికి దగ్ధమవుతున్న పూరిల్లు

రాజవొమ్మంగి: మండలంలోని ఆదివాసీల తండా అప్పలరాజుపేటలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో సేనాపత్తి లక్ష్మి, సత్తిబాబు దంపతులు నివాసం ఉంటున్న పూరిల్లు కాలి బూడిద అయ్యింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. రాత్రి సమయంలో భార్య, భర్తలు తగవు పడ్డారని, ఇంతలో హఠాత్తుగా భర్త సత్తిబాబు సొంత ఇంటినే నిప్పు పెట్టి పరారీ అయ్యాడు. స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. ఇల్లు, ఇంట్లో సామగ్రి అంతా బూడిదైంది. గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ వెంకయ్య ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి చేరుకొని జరిగిన సంఘటనపై ఆరా తీస్తున్నారు.

అవగాహన లేకనే షర్మిల ఆరోపణలు

- గిరిజనుల అభివృద్ధి కనిపించలేదా...
- రాజకీయ లబ్ధికోసమే సీఎం జగన్‌పై విమర్శలు
- ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర

సాక్షి, పాడేరు/ముంచంగిపుట్టు: కనీస అవగాహన లేకుండా పీసీసీ అధ్యక్షురాలు షర్మిల మాట్లాడుతున్నారని, రాజకీయ లబ్ధి కోసమే ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని పాడేరు ఎమ్మెల్యే, అరకు పార్లమెంట్ సమన్వయకర్త కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాడేరులో భాగ్యలక్ష్మి, ముంచంగిపుట్టులో సుభద్ర ఆదివారం విలేకరులతో మాట్లాడారు. చింతపల్లిలో శనివారం జరిగిన రచ్చబండ కార్యక్రమంలో షర్మిల.. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై చేసిన విమర్శలను ఖండించారు. రాష్ట్రంతో పాటు గిరిజన ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ చేపట్టిన అభివృద్ధి, అర్హులైన పేదలందరికీ అందిన సంక్షేమ పథకాలపై షర్మిలకు కనీసం అవగాహన లేకపోవడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన స్క్రిప్ట్‌ను చదివేశారని చెప్పారు. బాక్సైట్ తవ్వకాల కోసం జాతీయ రహదారి నిర్మిస్తున్నారని షర్మిల చెప్పడాన్ని వారు తప్పుపట్టారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజున చంద్రబాబు ప్రభుత్వం బాక్సైట్ జీవో 97ను జారీ చేస్తే ప్రతిపక్ష నేత హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి చింతపల్లిలో గిరిజనుల పక్షాన బాక్సైట్‌కు వ్యతిరేకంగా ఉద్యమం చేశారని వారు చెప్పారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే బాక్సైట్ జీవో 97ను పూర్తిగా రద్దు చేసి గిరిజనులకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి మేలు చేసి చరిత్రలో నిలిచారని, ఈ వాస్తవాలు షర్మిలకు తెలియకపోవడం దురదృష్టకరమన్నారు.

నాలుగేళ్ల 9 నెలల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో గిరిజన ప్రాంతాలు సంపూర్ణంగా అభివృద్ధి చెందాయని, గ్రామ సచివాలయాల వ్యవస్థతో గ్రామాలకు ఎంతో మేలు జరిగిందని చెప్పారు. రూ.500 కోట్లతో పాడేరులో మెడికల్ కళాశాల, రూ.35 కోట్లతో చింతపల్లిలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణాలు శరవేగంతో జరుగుతున్నాయని, ఈ అభివృద్ధి అంతా షర్మిలకు కనబడలేదా అంటూ వారు ప్రశ్నించారు. సికిల్ సెల్ ఎనీమియా బాధితులకు ఆరోగ్య భరోసాతో పాటు నెలకు రూ.10వేలు పింఛన్, పోడుభూములకు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు ఇలా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత ఒక జగనన్నకే సాధ్యమైందన్నారు. ప్రత్యేక హోదా కోసం రాహుల్‌గాంధీ ఏనాడు ప్రకటన చేయలేదని, రాజకీయ లబ్ధి కోసం అవగాహన లేని వ్యాఖ్యాలు చేసి ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తే ప్రజలు క్షమించరని, తగిన గుణపాఠం చెబుతారన్నారు. జీవో నంబర్ 3ను సుప్రీంకోర్టు రద్దు చేస్తే, గిరిజనులకు నూరుశాతం ఉద్యోగాలు ఇచ్చే ఈ జీవోను పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేసి పోరాటం చేస్తోందన్నారు. పార్లమెంట్ తలుపులు మూసి రాష్ట్రాన్ని విభజించి, ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీ నేడు రాష్ట్ర ప్రభుత్వంపై తప్పుడుగా మాట్లాడడం సమంజసం కాదని మండిపడ్డారు. అవగాహన లోపంతో షర్మిల గౌరవాన్ని కోల్పోతున్నారని వారు చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అత్యధిక మెజార్టీతో అన్ని స్థానాల్లో విజయం సాధిస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు.

డోలీపై మహిళ తరలింపు



బాధిత మహిళను డోలీపై గ్రామానికి తీసుకెళ్తున్న గిరిజనులు

అనంతగిరి: వైద్యసేవలందినప్పటికీ పరిస్థితి విషమంగా ఉండడంతో బాధిత మహిళను స్వగ్రామానికి డోలీపై తరలించిన ఘటన మండలంలోని పెదకోట పంచాయతీ పరిధిలోని ఆదివారం చోటుచేసుకుంది.. మండలంలోని పెదకోట పంచాయతీ మద్రేబు గ్రామానికి కొండతాంబి లింబో(45) అనే గిరిజన మహిళ గత మూడు రోజులు క్రితం తీవ్ర అనారోగ్యానికి గురైంది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను పాడేరు ఏరియా ఆస్పత్రికి తరలించి, వైద్య సేవలు అందించారు. అయినప్పటికి పరిస్థితి విషమంగా మారింది. దీంతో చేసేదేమిలేక కుటుంబ సభ్యులు ఆమెను ఆదివారం పాడేరు ఆస్పత్రి నుంచి తుస్సీబ్ వరకు ఆటోలోని తీసుకువచ్చి, అక్కడ నుంచి స్వగ్రామమైన మద్రేబు వరకు సుమారు ఐదు కిలోమీటర్లు డోలీపై మోసుకుంటూ తరలించారు. ఏటవాలు ప్రాంతమైన శివారు గ్రామంలో రోడ్డు లేదని, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాలుడిపై పోక్సో కేసు నమోదు

సీతమ్మధార: తనను ఓ మైనర్ లైంగికంగా వేధించాడని ఓ బాలిక ఫోర్త్‌టౌన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలిక, పోలీసులు తెలిపిన వివరాలివీ..

విజయనగరానికి చెందిన బాలిక విశాఖలోని ఓ నర్సింగ్ కళాశాలలో ఇటీవల చేరింది. కైలాసపురానికి చెందిన బాలుడు ఇన్‌స్టాగామ్‌లో ఆమెకు పరిచయం అయ్యాడు. క్రమంగా దగ్గరయ్యాడు. ఇదే అదనుగా బాలికను కైలాసపురంలోని తన అక్క ఇంటికి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అరకు తీసుకెళ్లి.. అక్కడ కూడా లైంగికదాడి చేసినట్లు బాలిక ఫిర్యాదులో పేర్కొంది. అక్కడి వీడియోలు, ఫొటోలు తీశాడని, వాటిని సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తానని బెదిరిస్తున్నాడని పోలీసులకు తెలిపింది. దీనిపై ఫోర్త్‌టౌన్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. తూర్పు ఏసీపీ బి.ఎం.జయరాంప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



కె.సాయి(ఫైల్)



వి.వెంకట రమణ (ఫైల్)

చింతపల్లిరూరల్: మండలంలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఇందులో దొడ్డికొండ సమీపంలో ద్విచక్ర వాహనం బోల్తా పడి ఒకరు..కొల్పూరి గ్రామంలోని గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో మరొకరు మృతి చెందారు. దామనపల్లి పంచాయతీ దొడ్డికొండ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి గూడెం కొత్తవీధి ఎస్‌ఐ అప్పలసూరి ఆదివారం అందించిన వివరాలు ప్రకారం.. చింతపల్లి నుంచి దొడ్డికొండ మార్గంలో అతివేగంతో వెళ్తున్న బైక్ సమీపంలోని ఉన్న ఉపాధి పనుల శిలాఫలకాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చింతపల్లికి చెందిన కుడుముల సాయి (13) అక్కడికక్కడే మృతి చెందాడు. గెమ్మిలి శ్రీనుకి తీవ్రంగా గాయాలయ్యాయి. చింతపల్లి ఏరియా ఆస్పత్రికి ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించినట్టు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ అప్పలసూరి చెప్పారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని కొల్పూరి గ్రామ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. ప్రమాద వివరాలు ఇలా ఉన్నాయి. వెములపూడి వెంకటరమణ(56)ద్విచక్రవాహనంపై చింతపల్లి నుంచి లంబసింగి వెళ్తుండగా కొల్పూరి గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. స్థానికుల సమాచారం మేరకు అంబులెన్స్‌లో చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ఆయన మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడు వెంకటరమణ లంబసింగి పీహెచ్‌సీలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సంఘటనపై మృతుడి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేయలేనట్టు తెలిసింది.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



పార్టీలో చేరిన వారితో వైఎస్సార్‌సీపీ పాడేరు సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు

చింతపల్లి రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే గిరిజనులకు మేలు చేకూరిందని ఆ పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి మత్స్యరాస విశ్వేశ్వరరాజు పేర్కొన్నారు. మండలంలోని అంతర్ల, పెంటపాడు, చుంచుంపుడికి చెందిన సుమారు 120 గిరిజన కుటుంబాలు ఆదివారం పార్టీలో చేరాయి. వీరికి ఆయన పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధికి ఆకర్షితులై తమ పార్టీలో భారీగా చేరుతున్నారన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం రానున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన నచ్చి పార్టీలో చేరామని పేర్కొన్నారు. ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, జీకే వీధి మండల పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్,ట్రైకార్ డైరెక్టర్ లోవరాజు, సర్పంచ్ రామకృష్ణ, మాజీ ఎంపీపీ వంతల బాబూరావు, జిల్లా కార్యదర్శి గిరి ప్రసాద్, మాజీ జిల్లా కార్యదర్శి జల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ సంప్రదాయం అందరికీ ఆదర్శం



మాట్లాడుతున్న ఏఎస్పీ రాహుల్‌మీనా



ఉత్సవానికి హాజరైన ప్రజలు

ఏఎస్పీ రాహుల్‌మీనా

చింతూరు: ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు అందరికీ ఆదర్శమని వీరు నుంచి మనం ఎంతో నాగరికత నేర్చుకోవచ్చని చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా అన్నారు. ఐదవ జాతీయ ఆదివాసీ సాంస్కృతిక సమ్మేళనంలో భాగంగా జరుగుతున్న రేలపండుగ శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏఎస్పీ రాహుల్ మీనా మాట్లాడుతూ ఆదివాసీలు నిర్వహిస్తున్న సంస్కృతి, సంప్రదాయ కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయన్నారు. మారుమూల గ్రామాలకు చెందిన ఆదివాసీల సమస్యల పరిష్కారానికి పోలీసుశాఖ కృషి చేస్తోందని, ఇందులో భాగంగా అత్యంత మారుమూల గ్రామమైన అల్లిగూడెం నుంచి బస్సు సర్వీసు ఏర్పాటు చేశామన్నారు. ఆదివాసీ చట్టాల పరిరక్షణకు ఎల్లప్పుడూ కృషి చేస్తామని, సమస్యల పరిష్కారానికి వారికి అండగా ఉంటామని ఆయన స్పష్టం చేశారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ ప్రధాన కార్యదర్శి సున్నం వెంకటరమణ మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించిన రేలపండుగ విజయవంతం చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివాసీ హక్కులు, చట్టాల పరిరక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. రేలపండుగ ఉత్సవానికి చింతూరు, కూనవరం, ఎటపాక, వీఆర్ పురం మండలాలతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో పరిషత్ ప్రచార కార్యదర్శి సోడె మురళి, విద్యార్థి పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పూసం శ్రీను, టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సోడె నారాయణ, మహిళా నాయకురాలు మిడియం రమణమ్మ, కాక రాజు, తుర్రం రాజయ్య, చిచ్చడి బాబూరావు, కణితి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

పీఎం పాలెం: శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం ధర్మవరం పెద్దరపుపేటకు చెందిన సాధు సూర్యనారాయణ(55) కొమ్మాదిలో నివసిస్తున్నాడు. ఇక్కడ కూలి పనులు చేస్తుండగా.. అతని భార్య ఇల్లమ్మ స్వగ్రామంలో వ్యవసాయ పనులు చేస్తోంది. ఆదివారం సాయంత్రం కొమ్మాదిలో రహదారి దాటుతుండగా.. అటుగా వస్తున్న ఆటో బలంగా ఢీ కొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి కొన ఊపిరితో ఉన్న అతన్ని సమీపంలోని గాయత్రి ఆస్పత్రికి తరలించగా.. అక్కడ ప్రాణాలు విడిచాడు.

మతి స్థిమితం లేని మూగ యువకుడిపై దాడి

- తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చేరిక
- పోలీసులకు యువకుడి తల్లిదండ్రుల ఫిర్యాదు



తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మతి స్థిమితం లేని మూగ యువకుడు

పాడేరు : మతిస్థిమితం లేని ఓ మూగ యువకుడు అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో పొరపాటు పడిన గ్రామస్తులు దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. ఆ యువకుడి తల్లిదండ్రుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక పాత పాడేరుకు చెందిన మోదకొండ, కొండమ్మ దంపతుల కుమారుడు వినాయకుడు పుట్టుకతో మూగవాడు. పైగా మతిస్థిమితం సక్రమంగా లేదు. శనివారం సాయంత్రం ఆ యువకుడు పాడేరు నుంచి దిగు మోదాపుట్టు గ్రామానికి వెళ్లాడు. మతిస్థిమితం లేని మూగ యువకుడిని చూసి దొంగగా భావించిన ఆ గ్రామంలోని కొంతమంది అతనిని తాళ్లతో చెట్టుకు కట్టి, కొట్టి తీవ్రంగా గాయపరిచారు. ఆదివారం ఉదయం ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు గ్రామానికి చేరుకుని గాయాలతో ఉన్న కుమారుడిని చూసి భోరున విలపించారు. వెంటనే పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అయోధ్యకు నగరవాసులు



ప్రయాణికుల తాకిడి

తాటిచెట్లపాలెం : ఇటీవల అయోధ్యలో ప్రాణప్రతిష్ట చేసిన ప్రాంతాన్ని దర్శించుకునేందుకు నగరవాసులు పయనమయ్యారు. ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో నడుపుతున్న పలు ప్రత్యేక రైళ్లలో ఆయా ప్రాంతాల నుంచి ప్రజలు అయోధ్యకు తరలివెళ్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం కాకినాడలో బయల్దేరిన కాకినాడ – ఆయోధ్య ధాం ఆస్థా స్పెషల్ రైలు ఆదివారం రాత్రి విశాఖపట్నం రైల్వేస్టేషన్ ఒకటో నంబర్‌కు చేరుకుంది. ఈ స్పెషల్ రైలు రాత్రి 10.20గంటలకు విశాఖ నుంచి అయోధ్యకు బయల్దేరింది. ఇప్పటికే టికెట్స్ బుక్ చేసుకున్న నగర పరిసర ప్రాంత వాసులు సుమారు 350 మంది విశాఖలో ఈ ప్రత్యేక రైలెక్కి అయోధ్యకు పయనమయ్యారు. రైల్వే స్టేషన్ స్టేషన్‌మేనేజర్ అరుణశ్రీ, ఇతర సిబ్బంది ఆధ్వర్యంలో గవర్నమెంట్ రైల్వే పోలీస్, రైల్వే భద్రతా దళం సిబ్బంది పర్యవేక్షించారు.

దశాబ్దాల కల..నెరవేరిన వేళ

- జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ అయిన పాఠశాల
- బాలికలకు మరింత చేరువైన ఇంటర్ విద్య



జూనియర్ కళాశాలగా మారనున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల

కొయ్యూరు: రెండు దశాబ్దాల కళాశాల కల నెరవేరింది. కొయ్యూరు ప్రభుత్వోన్నత పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మండలంలో జూనియర్ కళాశాల లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 14 పాఠశాలల నుంచి ఏటా వందలాది మంది విద్యార్థులు పదో తరగతి పూర్తి చేస్తున్నారు. వారంతా ఇంటర్ దూర ప్రాంతాలకు వెళ్లి చదవాలి. దీంతో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను దూర ప్రాంతాలకు పంపకపోవడంతో పదో తరగతితోనే చదువు ముగించేస్తున్నారు. ముఖ్యంగా బాలికలు టెన్త్ విద్యార్హతకే పరిమితమవుతున్నారు.

టీడీపీ పాలకుల నిర్లక్ష్యం

మండల కేంద్రంలో జూనియర్ కాలేజీ కోసం టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి పాలకులకు స్థానికులు పలుమార్లు వినతులు ఇచ్చారు. అయినా స్పందన కరువైంది. మండలంలోని పాఠశాలల దుస్థితిపై కూడా టీడీపీ పాలకులు కనీసం పట్టించుకోలేదని, కళాశాల ఏర్పాటుపై కూడా నిర్లక్ష్యం వహించారని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక విద్యాభివృద్ధికి శ్రీకారం చుట్టారని, ఇందులో భాగంగా పాఠశాలలకు మహర్దశ కలిగిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల తల్లిదండ్రుల ఆనందం

గత నెలలో చింతపల్లిలో పర్యటించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి మండలంలోని జూనియర్ కాలేజీ ఏర్పాటు విషయాన్ని ఎంపీ మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఎంపీపీ బడుగు రమేష్‌లు ప్రస్తావించారు. దీనిపై ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి, జూనియర్ కళాశాల ఏర్పాటుకు ఆమోదించడం హర్షణీయమని స్థానికులు చెబుతున్నారు. దీంతో ఇక్కడి విద్యార్థులు ఇంటర్ చదువుకు వేరే ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా పోయిందంటున్నారు. రెండు దశాబ్దాల కల నెరవేరిందని సంతోషం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జూన్ నుంచి కళాశాల అందుబాటులో రానుండడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఆనందంగా ఉంది



నేను ఇదే పాఠశాలలో పది వరకు చదువుకున్నాను.ఇప్పుడు ఇదే పాఠశాలకు హెచ్‌ఎంగా, కొయ్యూరు ఎంఈవోగా పనిచేస్తున్నాను. ఈ పాఠశాలను గుర్తించి దీనిని కళాశాలగా అప్‌గ్రేడ్ చేయడం ఆనందంగా ఉంది.ఇక నుంచి ఇది మరింత వృద్ధి చెందుతుంది.బాలికలు ఉన్నత విద్య చదివేందుకు ఆస్కారం ఉంటుంది.

– ఎల్.రాంబాబు, ఎంఈవో, కొయ్యూరు

జగనన్నకు కృతజ్ఞతలు



ఎంపీపీ అయిన నాటి నుంచి ఇక్కడ ఇంటర్ విద్యార్థుల అవస్థలు తెలుసుకుని కళాశాల ఏర్పాటుకు తీవ్ర ప్రయత్నాలు చేశాను. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఎంపీ మాధవి చొరవతో కళాశాల ఏర్పాటు జరిగింది.ఇక నుంచి బాల బాలికలు ఇక్కడే ఇంటర్ విద్యను అభ్యసించే వీలు ఉంటుంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– బడుగు రమేష్, ఎంపీపీ, కొయ్యూరు